నాణ్యమైన ఆహారం అందించాలి


అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

రంగారెడ్డినగర్: గురుకులాల్లో నాణ్యమైన ఆహారం అందించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం ఐడీపీఎల్ చౌరస్తాలో విద్యార్థులు పెద్ద ఎత్తున చౌరస్తాలో బైఠాయించి ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో కిలోమీటర్ మేర ట్రాఫిక్ జామైంది. పోలీసులు రంగప్రవేశం చేసి నాయకులను స్టేషన్‌కు తరలించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. అంతకుముందు నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలో గురుకులాల్లో ఫుడ్ పాయిజన్‌తో 48 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు బయటి జంక్ ఫుడ్ తినడం వల్లే అస్వస్థతకు గురయ్యారని మంత్రి కొండా సురేఖ పేర్కొనడం రాష్ట్ర ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా గురుకుల్లాలో నాణ్యమైన ఆహారం అందించకుంటే మరిన్ని పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ రేగోడ్ నగేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మృత్యుంజయ, నాగేంద్ర, వివేక్, డేవిడ్ పాల్గొన్నారు.

కేసుల్లో సమగ్ర విచారణ జరపాలి

- నేరస్తులను పట్టుకోవడంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలి
- సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి


సీపీ అవినాష్ మహంతికి చిత్రపటాన్ని అందజేస్తున్న డీసీపీ సురేష్‌కుమార్


సమీక్షలో పాల్గొన్న సీపీ అవినాష్ మహంతి, పోలీసు అధికారులు

జీడిమెట్ల: ప్రతి క్రైం కేసులో పోలీసు అధికారులు కచ్చితమైన విచారణ జరపాలని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి అన్నారు. గురువారం షాపూర్‌నగర్‌లోని డీసీపీ కార్యాలయంలో బాలానగర్ జోన్ పోలీస్ అధికారులతో క్రైం రివ్యూ మీటింగ్ నిర్వహించారు. మీటింగ్‌లో భాగంగా పోలీసు అధికారులకు సూచనలు చేశారు. నేరస్తులను త్వరగా అదుపులోకి తీసుకుని జ్యుడీషియల్ ఎదుట హాజరుపరచాలన్నారు. కిడ్నాప్ లాంటి కేసుల్లో పోలీసులు త్వరగా స్పందించాలన్నారు. విచారణ అనంతరం నేరస్తులను అదుపులోకి తీసుకోవడంలో ఆలస్యం చేయకూడదని సూచించారు. ప్రజలు కాలనీల్లో, వ్యాపార సముదాయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. విచారణలో ఉన్న కేసుల్లో త్వరగా చార్జ్‌షీట్‌లను సమర్పించి జ్యుడీషియల్ అధికారులకు సహకరించాలన్నారు. సమావేశంలో బాలానగర్ డీసీపీ సురేష్‌కుమార్, క్రైం డీసీపీ నరసింహ, స్పెషల్ బ్రాంచ్ డీసీపీ సాయిశ్రీ, సైబర్ క్రైమ్స్ డీసీపీ శ్రీబాలాదేవి, ఎస్ఓటీ డీసీపీ శ్రీనివాస్‌గుప్తా, అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, ఎస్ఓటీ అడిషనల్ డీసీపీ శోభన్‌కుమార్, బాలానగర్ ఏసీపీ హన్మంతరావు, సీసీఎస్ ఏసీపీ కళింగరావు, కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌పీ గ్యాస్ బంపర్ ఆఫర్

కుత్బుల్లాపూర్: హెచ్‌పీ గ్యాస్ కొత్త కనెక్షన్ తీసుకునే వారికి బంపర్ డ్రా ద్వారా కారు, మోటర్ బైక్స్, టీవీలు, మిక్సర్ గ్రైండర్స్, బ్లూటూత్ స్పీకర్లు తదితర గిఫ్టులను అందజేయనున్నట్లు సూరారం కుల్దీప్ హెచ్‌పీ గ్యాస్ ఎంటర్‌ప్రైజెస్ ప్రతినిధి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్, అడ్రస్ ప్రూఫ్ తీసుకురావాలని సూచించారు. షాపూర్ నగర్, సూరారం, బౌరంపేట్, బహదూర్‌పల్లి, గండి మైసమ్మ, గాజులరామారం ప్రాంత వాసులకు సూరారం కుల్దీప్ గ్యాస్ ఏజెన్సీ వారు కొత్త గృహ అవసరాల కోసం వినియోగించే డొమెస్టిక్ కనెక్షన్ల కోసం ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేశారు. వివరాలకు సూరారం కాలనీ ప్రాంతంలో ఉన్న కార్యాలయం వద్ద గానీ, 9177788863, 9177788865 ఫోన్ నెంబర్లలో ప్రతిరోజు ఉదయం 9: 30 నుంచి రాత్రి 7:30 గంటల వరకు సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

మృతుడి భార్యకు చెక్కు అందజేత



కుత్బుల్లాపూర్: పరిశ్రమలో రియాక్టర్ పేలి మృతి చెందిన కార్మికుడికి కార్మిక నాయకుడు మదన్‌గౌడ్ పరిశ్రమ యాజమాన్యంతో మాట్లాడి గురువారం రూ.45 లక్షలు ఇప్పించారు. ఈ నెల 20వ తేదీన జీడిమెట్ల ఫేజ్ 4లోని అరోర్ ఫార్మాస్యూటికల్స్ పరిశ్రమలో రియాక్టర్ పేలి ఒక కార్మికుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స పొందుతున్న బలరాం అనే కార్మికుడు ఈనెల 23న మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మదన్‌గౌడ్ పరిశ్రమ యాజమాన్యంతో మాట్లాడి బలరాం కుటుంబ సభ్యులకు రూ.45 లక్షల చెక్కుతో పాటు రూ.3.4 లక్షలు ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం, రూ.లక్ష దహన సంస్కారాల కోసం ఇప్పించారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు కార్పొరేట్ వైద్యం

నిజాంపేట్: సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు అందుతున్నాయని నిజాంపేట్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్ అన్నారు. గురువారం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ. 22 వేల చెక్కును బంగారమ్మకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



రేపు ఉచిత వైద్య శిబిరం

రంగారెడ్డినగర్: డాక్టర్ కేర్ హోమియోపతి, కొంపల్లికి చెందిన టూట్ డెంటల్ ఆసుపత్రుల సౌజన్యంతో శనివారం గాంధీనగర్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. గాంధీనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆరోగ్య శిబిరం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. అనుభవజ్ఞులైన హోమియో, దంత వైద్య నిపుణులు దీర్ఘకాలిక సమస్యలను పరీక్షించి చికిత్సపై అవగాహన కల్పించనున్నారు. ఈ శిబిరాన్ని స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

పారిశ్రామిక ఉత్పత్తుల ఎగ్జిబిషన్ ప్రారంభం


ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న విజయ్‌కుమార్

జీడిమెట్ల: పారిశ్రామిక ఉత్పత్తుల ఎగ్జిబిషన్లు పారిశ్రామికవేత్తలకు ఎంతో ఉపయోగపడతాయని టీఎస్ఐఐసీ అడిషనల్ డైరెక్టర్ ఎస్.విజయ్‌కుమార్ అన్నారు. గురువారం జీడిమెట్ల జేఐఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ ఎక్స్‌పోను ఆయన తెలంగాణ టీఎస్ఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో పరిశ్రమలను స్థాపించేందుకు, విస్తరించేందుకు అవకాశాలు మెండుగా ఉన్నాయని అన్నారు. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్‌లో నెలకొల్పిన వివిధ పరిశ్రమల ఉత్పత్తుల స్టాళ్లను ఆయన వీక్షించారు. కార్యక్రమంలో టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్ అనురాధ, ఐలా కమిషనర్లు నజీర్, విజయ, జేఐఏ అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ కె.సాయికిశోర్, ట్రెజరర్ దుర్గయ్యగౌడ్, జాయింట్ సెక్రటరీ సత్యనారాయణ, సభ్యులు కె. శ్రీనివాస్‌రెడ్డి, నీలం కరుణ్, సుబ్బారావు, పి.శ్రీనివాసరావు, ఆదినారాయణ, భాస్కరరాజు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు దీక్షా దివస్

దుండిగల్: బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు శుక్రవారం గండిమైసమ్మలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు దీక్షా దివస్‌ను నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే కార్యాలయం గురువారం ఓ ప్రకటనలో పేర్కొంది. ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు హాజరుకానున్నారు. నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



నిజాంపేట్: ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు కన్నెర్ర జేశారు. బాచుపల్లి తహసీల్దార్ ఆదేశానుసారం గురువారం నిజాంపేట్ సర్వే నెంబరు 334లో వెలసిన నిర్మాణాలను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నరేందరెడ్డి, భానుచందర్ సిబ్బందితో కలిసి కూల్చివేయించారు. ప్రభుత్వ భూముల్లో స్థలాలు కొనుగోలు చేసి మోసపోవద్దని, మరోమారు నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించారు.

నేడు సీనియర్ మహిళా జట్టు ఎంపిక

నిజాంపేట్: మేడ్చల్ జిల్లా సీనియర్ మహిళా ప్రాబబుల్స్ సెలెక్షన్స్ శుక్రవారం బాచుపల్లిలోని కాసాని కబడ్డీ అకాడమీలో జరుగుతాయని కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కాసాని వీరేష్‌ముదిరాజ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సెలెక్షన్స్‌కు 75 కేజీల లోపు ఔత్సాహిక క్రీడాకారులు మధ్యాహ్నం 2 గంటల వరకు ఆధార్ కార్డుతో రావాలని, ఎంపికైన సభ్యులు డిసెంబరు 7 నుంచి 12వ తేదీ వరకు ఎల్బీ స్టేడియంలో జరిగే సీనియర్ అంతర్ జిల్లా మహిళా కబడ్డీ చాంపియన్‌షిప్‌లో పోటీ పడతారని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 7396749998 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

అయ్యప్ప మహాపడి పూజ


అయ్యప్ప మహాపడి పూజలో పాల్గొన్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్: దుండిగల్ మున్సిపల్ డీపోచంపల్లిలో గురువారం అయ్యప్ప మహాపడి పూజా కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ శంభీపూర్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప భజనలు, గీతాలతో ఆ ప్రాంతమంత ఆధ్యాత్మికతను సంతరించుకుంది. అనంతరం అయ్యప్ప మాలాధారులకు భిక్ష ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, మహేందర్‌యాదవ్, సాయియాదవ్, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబానికి నష్టపరిహారం అందజేత



కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపల్ పరిధిలో ఇటుకలు మీద పడి ఓ భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న టీపీసీసీ లేబర్ సెల్ జిల్లా అధ్యక్షుడు కందాడి సుదర్శన్‌రెడ్డి, కొంపల్లి కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఉపేందర్‌రెడ్డి గురువారం కార్మిక కుటుంబాన్ని పరామర్శించారు. సదరు భవన నిర్మాణ యాజమాన్యంతో మాట్లాడి నష్టపరిహారంగా రూ.13 లక్షలు ఇచ్చేలా ఒప్పించి, అత్యవసర సహాయంగా కొంత నగదును కార్మికుడి కుటుంబానికి అందజేశారు. ప్రభుత్వ పరంగా సహాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డప్పు నరేందర్, నాగరాజుయాదవ్ పాల్గొన్నారు.

సభ్యత్వ రసీదులు అందజేత

చింతల్: ఇంటింటికీ బీజేపీ నినాదంతో సభ్యత్వ నమోదు కొనసాగుతుందని బీజేపీ చింతల్ డివిజన్ నాయకుడు కొట్టె సదానంద్ అన్నారు. గురువారం చింతల్ డివిజన్ రంగానగర్‌లోని పార్టీ కార్యాలయంలో పలువురికి సభ్యత్వం అందజేశారు. ఇప్పటి వరకు ఆరు వేల పైచిలుకు సభ్యత్వాలు అందజేశామని తెలిపారు.

పబ్లిక్ టాయిలెట్‌ను తరలించాలి

మూసాపేట: మూసాపేటలోని మున్సిపల్ కార్యాలయంలోకి వెళ్లే దారిలో ఉన్న పబ్లిక్ టాయిలెట్‌తో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ కార్యాలయానికి వచ్చే ప్రజల కోసం ఏర్పాటు ఇక్కడ దీనిని చేశారు. కానీ నిర్వహణ లేకపోవడంతో కొన్ని రోజుల క్రితం దీనిని మూసివేసి చుట్టూ మొక్కలు ఏర్పాటు చేశారు. అయితే పబ్లిక్ టాయిలెట్ ప్రభుత్వ పాఠశాల ప్రహరీగోడ పక్కనే ఉండటంతో పాఠశాల తరగతి గదులకు దుర్వాసన వస్తూ విద్యార్థులకు ఇబ్బంది కలుగుతుంది. దీంతో కిటికీలు మూసుకుని పాఠాలు వినాల్సిన పరిస్థితి నెలకొంది. మొక్కలు ఎన్ని అడ్డు పెట్టినా సెలవుల సమయంలో కొందరు ఇక్కడే మూత్ర విసర్జన చేస్తున్నారు. ఇప్పటికైనా దీనిని ఇక్కడ నుంచి మరో చోటుకు తరలించాలని పలువురు కోరుతున్నారు.

రాంగ్ రూట్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్


రాంగ్‌రూట్‌లో పట్టుబడ్డ వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ పోలీసులు

సుభాష్‌నగర్: రాంగ్ రూట్‌లో ప్రయాణించి ప్రాణాలు కోల్పోతున్నారని జీడిమెట్ల ట్రాఫిక్ ఎస్ఐ సందీప్ అన్నారు. గాజులరామారం చిత్తారమ్మ ఆలయం వద్ద ప్రధాన రోడ్డులో గురువారం రాంగ్ రూట్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పదుల సంఖ్యలో వాహనదారులు పట్టుబడగా.. వారికి రాంగ్ రూట్‌లో వెళ్తే జరిగే ప్రమాదాల గురించి అవగాహన కల్పించారు. ఎస్ఐలు సందీప్, మోతీలాల్ పట్టుబడిన వాహనదారులతో ఇకపై రాంగ్ రూట్లో వాహనాలు నడపబోమని ప్రతిజ్ఞ చేయించారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు


స్పెషల్ డ్రైవ్‌ను పర్యవేక్షిస్తున్న పోలీసులు, అధికారులు


సుచిత్ర చౌరస్తాలో ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగిస్తు..

కుత్బుల్లాపూర్: ఫుట్‌పాత్ ఆక్రమణలపై గురువారం అల్వాల్ ట్రాఫిక్, పేట్‌బషీరాబాద్ లా అండ్ ఆర్డర్ పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు నేతృత్వంలో సుచిత్ర చౌరస్తా నుంచి కుత్బుల్లాపూర్ ప్రధాన రోడ్డులో ఫుట్‌పాత్‌లపై వెలిసిన డబ్బాలు, దుకాణాలను జేసీబీ సాయంతో తొలగించారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వెలుగులేవీ?

చింతల్: చింతల్ డివిజన్ చంద్రానగర్ రోడ్డు నెంబర్ 2లో ఇరవై రోజులకు పైగా వీధి దీపం వెలగడం లేదు. ఇదే విషయమై స్థానిక నేతలు అధికారులకు సమాచారం ఇచ్చినా ప్రయోజనం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీధి దీపం వెలుగకపోవడంతో అటుగా వెళ్లే వారిని వీధి కుక్కలు వెంబడిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని, అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కాలనీల ప్రజలు కోరుతున్నారు.



ఆర్‌టీసీ డిపోలో వన భోజనాలు

మూసాపేట: కూకట్‌పల్లి ఆర్‌టీసీ డిపోలో గురువారం కార్తీకమాస వన భోజనాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి డివిజనల్ మేనేజర్ కవిత పాల్గొని ఉద్యోగస్తులతో సరదాగా గడిపారు. అదే విధంగా ఉద్యోగస్తులు వారి కుటుంబ సభ్యులతో కలిసి ఆడిపాడిన అనంతరం సామూహిక భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ హరి, అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, అసిస్టెంట్ ఇంజినీర్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలే సేవలు మరువలేనివి


షాపూర్‌నగర్‌లో జ్యోతిరావు పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఐటీయూ మండల కార్యదర్శి లక్ష్మణ్

కుత్బుల్లాపూర్: అణగారిన వర్గాలకు అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని వక్తలు అన్నారు. గురువారం జ్యోతిరావు పూలే వర్ధంతిని పురస్కరించుకుని నియోజకవర్గ వ్యాప్తంగా ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్త్రీలను విద్యావంతులు చేయడంతో పాటు ఆనాటి సమాజంలో నెలకొన్న దురాచారాలను రూపు మాపేందుకు జ్యోతిరావు పూలే కృషి చేశారన్నారు. ఆయన ఆశయాల సాధనకు నేటి యువత పాటు పడాలని పిలుపునిచ్చారు.


జగద్గిరిగుట్టలో నివాళులర్పిస్తున్న ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్యగౌడ్ తదితరులు

అయ్యప్ప స్వాములకు అన్న సమారాధన

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని సాయినగర్ వెస్ట్ కాలనీకి చెందిన శివరాజ్ గౌడ్ నివాసంలో అయ్యప్ప మాలధారణ చేసిన స్వాములకు అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్, ప్రదీప్ రెడ్డి, రామరాజు, దయాసాగర్, పరమేష్, గోపాల్‌రావు, నవీన్ రావు, భారత్ గౌడ్, రవి, పృథ్వీ, శివ తదితరులు పాల్గొన్నారు.

రసాయన శాస్త్రంలో కొత్త పరిశోధనలు అవసరం


రమాదేవి దంపతులను సన్మానిస్తున్న డా. కె. వెంకటేశ్వరరావు, అధ్యాపకులు

కేపీహెచ్‌బీకాలనీ: ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న కాలుష్యం, వాతావరణ మార్పులు, వనరుల కొరత వంటి సవాళ్లను ఎదుర్కొనేందుకు రసాయన శాస్త్రంలో కొత్త పరిశోధనలు చేపట్టాల్సిన అవసరం ఉందని జేఎన్‌టీయు హెచ్ రెక్టార్ డాక్టర్ విజయకుమార్ రెడ్డి తెలిపారు. రెండు రోజుల పాటు యూనివర్సిటీ క్యాంపస్ కళాశాల కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'రిసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ ఇన్ కెమికల్ సైన్సెస్' సదస్సుకు విజయకుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ బి. రమాదేవి పదవీ విరమణ సందర్భంగా నిర్వహిస్తున్న సదస్సులో దేశం నలుమూలల నుంచి 100పైగా సందేశాలు అందగా అందులో నుంచి 30 మౌఖిక ప్రదర్శనలు, 25 పోస్టర్ ప్రదర్శన కోసం ఎంపిక చేశారు. ఈ సందర్భంగా విజయకుమార్ రెడ్డి మాట్లాడుతూ సుస్థిరత అనేది ఒక పదం మాత్రమే కాదని భవిష్యత్తు ఆవిష్కరణలకు ఆవశ్యకమైన దారి వంటిదని తెలి పారు. నిత్యం మనం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు కెమిస్ట్రీ రంగంలో కొత్త పద్ధతులను అభివృద్ధి చేయాలన్నారు. అనంతరం రిజిస్ట్రార్ కె. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కెమిస్ట్రీ ప్రొఫెసర్‌గా రమాదేవి అందించిన సేవలు మరవలేనివన్నారు. ఐఐటీ మద్రాస్ డాక్టర్ రమేష్ లక్ష్మీనారాయణ గార్డాస్ మాట్లాడుతూ విద్యారంగంలో ఆధునికతకు అత్యంత ప్రాధాన్యత లభిస్తుందని, ఆలోచనల మార్పిడి, పరిచయాల నిర్మాణం వంటి వాటితో ఆధునికతను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ పద్మావతి, అధ్యాపకులు అపర్ణ, సబిత కళ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.